రైతుబజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు కిలోరూపాయల్లో రూ.టమాటా 19, వంకాయ రూ.40, బెండకాయ రూ.45, పచ్చిమిర్చిరూ.40, కాకరకాయ రూ.52, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 17, క్యారెట్ 35, దొండకాయ రూ.40, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.28, సొరకాయ 13, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.09, చిక్కుడు 55, అర్వి రూ.28, మునగ 75, చిలగడదుంప 50, బీట్‌రూట్ రూ.23, కీర 15, ఫ్రెంచ్‌బీన్స్ 35, కాప్సికమ్ రూ.75గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నిద్రలోనే మహిళ మృతి

ఉప్పల్: ఓ గృహిణి నిద్రలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామంతాపూర్ అరవింద్‌నగర్ కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ శ్రీనివాస్ భార్య పద్మ(46) ఆదివారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. సోమవారం ఉదయాన్నే శ్రీనివాస్‌ను పద్మ నిద్రలేపి పనికి పంపించింది. అనంతరం తాను పడుకుంది. పనిలేక శ్రీనివాస్ ఇంటికొచ్చి చూసేసరికి మృతి చెంది ఉంది. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్ర రామకార్యంలో అందరూ పాల్గొనాలి



అయోధ్యరాముని అక్షింతలను గడపగడపకు తీసుకెళ్తున్న బృందం

చైతన్యపురి: అయోధ్యలో రామప్రతిష్ట పురస్కరించుకుని చేపట్టిన గడపగడపకు రాములవారి అక్షింతలు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సహ సంయోజక్ కీర్తిగారి అనంతాచారి పిలుపునిచ్చారు. గడపడపకు అయోధ్య శ్రీరామ ప్రాణప్రతిష్ట అక్షింతలను శ్రీకృష్ణనగర్‌కాలనీలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్షింతలతో పాటు రాములచిత్రపటాన్ని అందజేశామన్నారు. గౌతంనగర్ కాలనీ అధ్యక్షుడు కళ్లెం మధుసూదన్‌రెడ్డి, కృష్ణానగర్ కాలనీవాసులు లక్ష్మణస్వామి, రాజు గోడిలాల్, రాజుగౌడ్, రాజేష్, బిక్షపతి, జ్ఞానేశ్వర్, జనార్దన్‌రెడ్డి, వేణు, మహేష్, సిద్దు, తనూజ తదితరులున్నారు.

అక్షింతల కలశం శోభాయాత్ర..

మన్సూరాబాద్: అయోధ్య శ్రీరాముని అక్షింతల కలశం, శోభాయాత్ర నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయం నుంచి ప్రారంభమై కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గత వారంరోజులుగా నిత్యం హనుమాన్ చాలీసా పారాయణం, అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతల శోభాయాత్ర రామకీర్తనలు, మంగళ హారతులతో వైభవంగా చేపట్టారు. దేవాలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, మురళి, రమణమూర్తి, కృష్ణమూర్తి తదితరులున్నారు.



శోభాయాత్రలో దుర్గాదేవి ఆలయ కమిటీ నాయకులు

ఐఎస్‌సదన్‌కు శ్రీరాముడి అక్షింతలు..

సైదాబాద్: అయోధ్యలో పవిత్ర శ్రీరామ మందిరం నిర్మించడం హిందువులందరికీ సంతోషకరమని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. శ్రీరామ మందిర నిర్మాణంలో అయోధ్యలో పూజించిన శ్రీరాముడి అక్షింతలు సోమవారం ఐఎస్‌సదన్‌కు చేరుకున్నాయి. డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, నాగార్జునకాలనీ, వైశాలీనగర్ కాలనీవాసులతో కలిసి మేళతాళాలతో నిర్వహించిన అక్షింతల ఊరేగింపులో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఊరేగింపులో పలుచోట్ల స్థానికులు అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అయోధ్య నుంచి తరలివచ్చిన పవిత్ర అక్షింతలు డివిజన్ పరిధిలోని ఇంటింటికీ చేరేలా చూస్తామన్నారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరామమందిరం ప్రారంభమైన తర్వాత దేశ నలుమూలల నుంచి శ్రీరామదర్శనానికి వెళ్లేందుకు కేంద్రప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఏడీజీ సీహెచ్. వెంకటేశ్వర్‌రావు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్ రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను జీఎస్ఐ అడిషినల్ డైరెక్టర్ జనరల్ సీహెచ్. వెంకటేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీడీజీ ఎల్‌పీసింగ్, అన్షుమన్ ఆచార్య, ఎస్ఎస్ మహాపాత్రో, డైరెక్టర్లు ఎంఎల్ దొర, పీఎస్ఎస్, హార్మోహన్ మిషరా, జాయింట్ డైరెక్టర్ తారకేశ్వర్‌రావు, అసోసియేషన్ నేతలు చెక్రేశ్వర్, ఆనంద్‌కుమార్, లింగ్యా, రాజశేఖర్, శివశంకర్, స్వామి, శేఖర్, సురేష్, శ్రీనివాసరావు, రవీందర్ తదితరులున్నారు.

చర్చిలో నూతన సంవత్సర వేడుకలు



వనస్థలిపురం లిటిల్‌ల్యాంబ్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లిటిల్‌ల్యాంబ్ చర్చిలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సనత్‌నగర్ బైబిల్‌మిషన్‌కు చెందిన రెవ. శేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ రెవ.డా.సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చర్చి అధ్యక్షుడు టీ.ఎస్.బాబూరావు, కార్యదర్శి జార్జి ముల్లర్, సురేష్‌కుమార్, భానుకిరణ్, ఎస్.జాన్, జాకబ్‌ప్రసాద్, రఘురాం, కాంతా రమేష్, విజయలక్ష్మి లాజరస్ తదితరులున్నారు.

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ



యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

మన్సూరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి యూత్‌కాంగ్రెస్ రాష్ట ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులున్నారు.

చాదర్‌ఘాట్: సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్‌నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం షేక్ అక్బర్ ముఖ్యమంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు.

ఎల్‌బీనగర్: సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం సచివాలయంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా పుష్ప గుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కేటీఆర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



కేటీఆర్‌తో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం తెలంగాణ భవన్‌లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మర్యాద పూర్వంగా పుష్ప గుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

అష్టలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో ద్వార తోరణపూజ, గోపూజ నిర్వహించారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రంగనాథ ఆలయానికి పోటెత్తిన భక్తజనం..

జియాగూడ: జియాగూడలోని రంగనాథస్వామి ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు చేరుకుని రంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ప్రతినిధి శేషాచార్యులు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కేలండర్, క్లాత్ సంచులను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందరరాజన్

మన్సూరాబాద్: గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ (4టైమ్స్), ప్రముఖ కళాకారులు, రచయిత, సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ సోమవారం రాష్ట గవర్నర్ తమిళసై సౌందరరాజన్‌ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ చేతుల మీదుగా నూతన సంవత్సర కేలండర్‌ను, క్లాత్ సంచులను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు.

'అనాథ విద్యార్థి గృహం ఓ దేవాలయం'



స్నాక్స్ అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

దిల్‌సుఖ్‌నగర్: అనాథ విద్యార్థి గృహం ఓ అద్భుత దేవాలయమని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వైస్‌చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రంగారెడ్డిజిల్లా యువజన సంఘం అధ్యక్షుడు లోకేష్‌గుప్తా ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి బిస్కెట్లు, స్నాక్స్ అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తున్న అధ్యక్షుడు మార్గం రాజేష్, కమిటీని అభినందించారు. సంఘం నాయకులు చింతల రజనీకాంత్, మహిళ అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, జనరల్ సెక్రటరీ శైలజ, మణిమాల, సుభాషిని తదితరులున్నారు.

సత్కారం



కార్పొరేటర్ లచ్చిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వీరాంజనేయ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కమిటీని నియమించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కమిటీ సభ్యులు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీ నూతన అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రామయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ శంకరయ్య తదితరులున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 192 మంది



కొత్తపేట చౌరస్తాలో తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నాగోలు: రాచకొండ పరిధిలోని ఎల్‌బీనగర్‌జోన్ పరిధిలో నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 192 మంది మద్యం సేవించి వాహనలు నడుపుతూ.. పోలీసులకు పట్టుబడారు. మద్యం సేవించి వాహనలు నడపొద్దని పోలీసులు చెప్పిన పట్టించుకోకుండా మద్యం తాగి వాహనాలతో రోడ్డుపైకి వచ్చారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ చౌరస్తాల వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 87 మంది పట్టుబడ్డారు.

- వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 105 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు వారి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
- మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ టీటీఐలో కౌన్సిలింగ్ ఉంటుందని పోలీసులు వివరించారు.
- ఎల్‌బీనగర్ పరిధిలోని వివిధ ఫ్లైఓవర్‌లపై ప్రమాదాలు జరగకుండా ఆదివారం రాత్రి ఫ్లైఓవర్‌లను పోలీసులు మూసేశారు.

కరాటేతో పరిపూర్ణ ఆరోగ్యం

ఉప లోకాయుక్త నిరంజన్‌రావు



విద్యార్థులకు బ్లాక్ బెల్టులను పంపిణీ చేస్తున్న ఉప లోకాయుక్త నిరంజన్‌రావు

కాచిగూడ: కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులకు బ్లాక్ బెల్టులను ఉప లోకాయుక్త నిరంజన్‌రావు ప్రదానం చేశారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన 9 మందిలో బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్ విభాగంలో శ్యాంకుమార్, హంస, అమృత రెడ్డి, గణ సంతోషిణిరెడ్డి, బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ విభాగంలో నందిని, బ్లాక్ బెల్ట్ విభాగంలో వర్థిని, మేధా, రిషిత, అవిఘ్న వెంకటరెడ్డి బెల్ట్ గ్రేడింగ్‌లు పొందారు. ముఖ్య అతిథిగా నిరంజన్‌రావు పాల్గొని మాట్లాడుతూ... యువతతో పాటు బాలికలు బ్లాక్‌బెల్ట్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కరాటే విద్య ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైనదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ముత్యంరెడ్డి, సీనియర్ అడ్వకేట్ అశోక్ కుమార్, డాక్టర్ కృష్ణారెడ్డి, కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఉమా మహేశ్వర్, డాక్టర్ వరుణ్య, మాస్టర్ నర్సింగ్‌రావు, కరీం తదితరులు పాల్గొన్నారు.

సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ మాక్ సొసైటీ కార్యవర్గం



కాచిగూడ: సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ మాక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడిగా సయ్యద్ ఇక్బాల్, ఉపాధ్యక్షుడిగా వెంకటి, కార్యదర్శిగా పరమేశ్వర్, కోశాధికారిగా వినోద్ ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా సభ్యుడిగా లక్ష్మయ్య ఎన్నికలలో విజయం సాధించగా నిజామాబాద్ జిల్లా శ్రీకాంత్, వరంగల్ జిల్లా నుంచి వీరేశం సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కెనరా బ్యాంక్ వర్కింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ కార్యదర్శి నరేష్ బాబు, చైర్మన్ రమణ, వీరిని సన్మానించి అభినందనలు తెలిపారు. నాయకులు ఆర్.శ్రీనివాస్, హన్మంతరావు, వెంకటేశ్వర్లు, అబ్దుల్ హాయ్, ఎస్. శ్రీను, దినేష్, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే టెక్నాలజీ నేర్చుకోవాలి



బోడుప్పల్: విద్యార్థి దశ నుంచే టెక్నాలజీ నేర్చుకొని ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సీసీఎంబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌జీ పల్లెల అన్నారు. బోడుప్పల్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో 'ఫ్యూజన్ ఫియస్టా' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ అనేది విద్యార్థులలో పాఠశాల స్థాయిలో నేర్చుకోవాలని, వివిధ శాఖల్లో సరికొత్త ప్రయోగాత్మక పరికరాలను అందరికీ ఉపయోగపడేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ విధంగా ప్రోత్సహిస్తే విద్యార్థులు అద్భుతాలు చేసి నిరూపిస్తారన్నారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను ఆయన తిలకించారు. పాఠశాల రీజనల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నళిని జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లు.. ఇష్టారాజ్యంగా పార్కింగ్!

- రోడ్లను ఇష్టానుసారంగా తవ్వి వదిలేస్తున్న వైనం
- అధ్వానంగా మారిన రోడ్లపై ప్రమాదాలు
- వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



ఆర్టీసీ కాచిగూడ డిపో రోడ్డులో ఏర్పడిన గుంతలు

కాచిగూడ: అధికారుల నిర్లక్ష్యం వాహన, పాదచారులకు ప్రాణ సంకటంగా మారింది. గుంతలు పడ్డ రోడ్ల మరమ్మతుల విషయంలో అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం స్థానికంగా ఇబ్బందులను సృష్టిస్తుంది. ఇది రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. వరంగల్ జాతీయ రహదారి నుంచి ఆర్టీసీ కాచిగూడ డిపో రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

అధ్వానంగా ఆర్టీసీ డిపో రోడ్డు...

ఆర్టీసీ కాచిగూడ డిపో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డిపో రోడ్డులో ఆర్టీసీ క్వార్టర్స్ మధ్యలో ఖాళీగా ఉన్న స్థలాల్లో అంతర్ రాష్ట బస్సు సర్వీసులను పార్కింగ్ చేస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో బస్సుల రాకపోకలు సాగిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు..

వరంగల్ జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలలో వాహనదారులతో పాటు పాదచారులు కూడా గాయాలపాలవుతున్నారు. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించాలంటేనే స్థానికులు హడలిపోతుంటారు. ముఖ్యంగా ఈ రహదారి మీదుగా తమ పిల్లలను ఒంటరిగా పాఠశాలలకు పంపించాలంటే వారి తల్లిదండ్రులు జంకుతున్నారు.

రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేయాలి..

స్థానికుల విజ్ఞప్తి మేరకు జాతీయ రహదారిపై రోడ్డు డివైడర్ల నిర్మాణాన్ని చేపట్టారు. కాచిగూడ కబేళా వైపునకు డివైడర్లను ఏర్పాటు చేసి వదిలేశారు. హర్రాస్‌పెంట హిందూ శ్మశాన వాటిక వద్ద అసలు రోడ్డు డివైడర్లే లేకపోవడం వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి..

అధికారులు స్పందించి రోడ్డు మర్మతులు వెంటనే చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. హిందూ శ్మశాన వాటిక వద్ద రోడ్డు డివైడర్‌ను ఏర్పాట చేసి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కాచిగూడ ఆర్టీసీ క్వార్టర్స్ వద్ద ఖాళీ స్థలంలో నిలిపిన బస్సులు

బీసీ కులగణనను తక్షణమే చేపట్టాలి

కాచిగూడ: కులగణన విషయంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి అన్నారు. కాచిగూడలో జరిగిన బీసీ దళ్ రాష్ట కమిటీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీ కుల గణన జరగాలని ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్నామని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా జనగణనలో కులగణన చేపడతామని రాహుల్ గాంధీ ప్రకటించడం శుభ పరిణామమని అన్నారు. బీజేపీ హయాంలో బీసీలకు ఎలాంటి న్యాయం జరగలేదని విమర్శించారు. తాను కూడా బీసీనే అని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్రమోదీ బీసీ కులగణనను తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని నిజమైన బీసీ అయితే తక్షణం పార్లమెంట్ ఎన్నికల లోపు బీసీ కుల గణనన చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు.

గౌతంరావుకు సత్కారం



కాచిగూడ: నూతన సంవత్సరం సందర్భంగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావును కలిసి అభినందించి, ఘనంగా సత్కరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని గౌతంరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



సీఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఇటీవల శాసనసభ ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యదపూర్వకంగా కలిసి బీసీల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంపుదల చేయాలని, ఉప కులాల వారీగా రిజర్వేషన్లను అమలు చేయాలని, సంచార కులాలకు ప్రత్యేకంగా ఐదు శాతం రిజర్వేషన్లును ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏ పథకం చేపట్టిన అది బీసీలకు మేలు చేసే విధంగా ఉండాలని లేఖలో కోరారు.

గోపాల్‌రెడ్డికి ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు

బోడుప్పల్: ట్రస్మా రాష్ట ఉపాధ్యక్షుడు, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు వచ్చింది. నగరంలో తెలంగాణ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్) 2023లో కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అనంతరం బోడుప్పల్‌లో ఆయన మాట్లాడుతూ గ్రీన్ పాంతర్ షార్ట్ ఫిలిం ద్వారా పర్యావరణంపై రూపొందించిన సందేశాత్మక డాక్యుమెంటరీకి ఈ అవార్డు వచ్చిందన్నారు. సతమతమయ్యే మానవాళిని కాపాడుకునేందుకు తగిన పరిష్కార మార్గాలను చూపుతూ తనవంతు కృషి చేస్తానన్నారు. భూమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్న చిన్న షార్ట్ ఫిల్మ్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహించి సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.